APTEL/2009/29308

స్నేహిత
# ఎక్స్‌ప్రెస్
నిజం దాగదు.. వార్త ఆగదు
తెలుగు దినపత్రిక

23-02-2026
సోమవారం
హైదరాబాద్
సంపుటి: 17 । సంచిక: 123
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్
FOLLOW:
https://epaper.expresstelugudaily.com



2

## ఏఐ సమిట్ ప్రపంచ దేశాలను ఆకర్షించింది

- మన టెక్నాలజీ చూసి ఆశ్చర్యపోయాయి
- సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగిస్తూ భారత్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోంది
- డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- 131వ 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మోడీ వ్యాఖ్యలు
- 10 నెలల చిన్నారి అలిన్ షెరిన్ నలుగురికి జీవనదాతయిందని ప్రశంస

భారత ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిన ఏఐ సమిట్ ప్రపంచ దేశాలను ఆకర్షించిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఏఐ సమిట్‌లో ముఖ్యంగా రెండు భారత ఆవిష్కరణలు ప్రపంచ నేతలను ఆశ్చర్యపరిచాయని పేర్కొన్నారు. జంతువుల చికిత్సకు.. వాటిని ట్రాక్ చేయడానికి ఏఐను వినియోగించడం, భారత పురాతన గ్రంథాలు, జ్ఞానాన్ని సంరక్షించడానికి ఏఐను ఉపయోగించడం చూసి ప్రపంచ నేతలు ప్రశంసించారని ప్రధాని అన్నారు. ఆదివారం 131వ 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. కృత్రిమ మేధస్సు, అంతరిక్ష పరిశోధన, సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ సహా అభివృద్ధి చెందుతోన్న సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగిస్తూ భారత్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని అన్నారు. మన యువత తమ ఆవిష్కరణలతో దేశ కీర్తిని ఉన్నత శిఖరాలను తీసుకువెళ్లే శక్తిని కలిగి ఉందని ప్రశంసించారు.

## ఎన్నికల వరకే రాజకీయం

- గెలిచిన తర్వాత ఏ పార్టీ వారైనా పేదవాడికి సేవ చేయాల్సిందే
- ప్రజలు నమ్మి ఓటేశారు.. బాధ్యతాయుతంగా పని చేయాలి
- ఆదర్శ మున్సిపాలిటీగా ఏదులాపురాన్ని తీర్చిదిద్దుతాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



2

## 'మధు పార్క్' ను కూల్చకుండా చూసుకునే బాధ్యత నాది

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తా
- నోటీసులను ఉపసంహరించుకునేలా వ్యక్తిగతంగా ప్రయత్నిస్తా
- ఏ పార్టీ నాయకులైనా నాపై రాజకీయంగా ఆరోపణలు చేయవద్దు
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



2

## గోదావరి జలాల వివాదం
# రాజకీయరంగు పులుముకుంది

### గత పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే వివాదమే ఉండేది కాదు

- ఇకనైనా పూర్తి చేసి.. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసుకోవాలి
- ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు మీదే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు
- మేడిగడ్డ కుంగిన తర్వాత అక్కడి నుంచి నీరు ఎత్తిపోయలేదు
- కాళేశ్వరం నిరుపయోగమైనా.. అత్యధికంగా వరి దిగుబడి వస్తోంది
- కేసీఆర్, హరీశ్‌రావు తప్పులు చేశారని ప్రజలు గ్రహించారు
- జలాల విషయంలో ఏపీకి సహకరిస్తున్నామనేది పూర్తి అసంబద్ధం
- ఎన్నికల్లో ప్రజల తీర్పు చూశాక కూడా బీఆర్ఎస్ నేతలు మారలేదు
- ప్రజల సొమ్ముతో కట్టిన ప్రాజెక్టులను వృథాగా వదిలేసేది లేదు
- మరమ్మతులు చేసి.. వినియోగంలోకి తెస్తాం
- విపక్షం అసెంబ్లీకి వచ్చి గోదావరి జలాలపై సూచనలు చేస్తే స్వీకరిస్తాం: సీఎం రేవంత్ రెడ్డి



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** గోదావరి జలాల వివాదం రాజకీయరంగు పులుముకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే వివాదమే ఉండేది కాదన్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. తుపాకులగూడెం వద్ద దేవాదుల ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం పనుల పురోగతిపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎంపీ బలరాం నాయక్, జిల్లా ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 960 టీఎంసీలకు సరిపడా ప్రాజెక్టులు కట్టి ఉంటే సమస్య ఉండేది కాదన్నారు. '' ఇకనైనా ప్రాజెక్టులు పూర్తి చేసి.. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసుకోవాలి. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు మీదే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. మిగతా 2లో...



2

## జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..
### ముగ్గురు ఉగ్రవాదుల హతం

- మృతుల్లో జైషే మహమ్మద్ కమాండర్ సైపుల్లా
- ఘటనాస్థలం నుంచి రెండు ఏకే-47 రైఫిల్స్, ఇతర పేలుడు పదార్థాలు స్వాధీనం

## ఐసెట్ అభ్యర్థులకు టీశాట్ డిజిటల్ పాఠాలు

**నేటి నుండే ప్రసారాలు ప్రారంభం.. సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి**



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పలు పోటీ పరీక్షలకు డిజిటల్ లెసన్స్ అందిస్తోన్న టీశాట్ నెట్వర్క్ తెలంగాణ ఐసెట్ 2026 పరీక్షలకు సైతం డిజిటల్ లెసన్స్ అందిస్తోందని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగతా 2లో...



2

## మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ..

## యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ హత్యే..



- అతని స్నేహితుడే చేయించాడు
- ఆర్థికపరమైన విభేదాలే హత్యకు కారణం
- కేసును ఛేదించిన పోలీసులు

**కూసుమంచి, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రచయిత, యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ (48)ది హత్యేనని, అతని స్నేహితుడు వేణు మాధవరెడ్డి ముగ్గురు వ్యక్తులతో హత్య చేయించాడని ఖమ్మం గ్రామీణ ఏసీపీ తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. శ్రీనివాస్‌కు, వేణు మాధవరెడ్డికి మధ్య ఆర్థికపరమైన విభేదాలు ఉన్నాయని, ఈ క్రమంలోనే అతని అడ్డు మిగతా 2లో...

## కాంగ్రెస్ పార్టీకి ఏటీఎం లాగా మారిన
# తెలంగాణ రాష్ట్రం



### మేమెన్నో సార్లు చెప్పిన విషయం సాక్షాత్తు రేవంత్ రెడ్డే ఒప్పేసుకున్నాడు

### రెండేళ్లలోనే మూడు లక్షల కోట్ల అప్పు తెచ్చి రాష్ట్రంలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదు: కేటీఆర్

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలంతా తలో చెయ్యి వేసి ఒక వెయ్యి కోట్లు పోగు చేసి రాహుల్ గాంధీ కుటుంబానికి ఇచ్చే సామర్థ్యం ఉందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా కీలక ట్వీట్ పెట్టారు. 'రెండేళ్లుగా తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి ఏటీఎం లాగా మారింది అని మేమెన్నో సార్లు చెప్పిన విషయం ఇప్పుడు సాక్షాత్తూ రేవంత్ రెడ్డే నిస్సిగ్గుగా ఒప్పుకున్నాడు. రైతన్నలకు, మహిళలకు, యువతకు, అవ్వాతాతలకు ఉద్యోగస్తులకు, రిటైర్డ్ ఉద్యోగస్తులకు ఇచ్చిన 420 హామీల అమలుకేమో రూపాయి లేదంటాడు. మిగతా 2లో...



2

## పార్టీ బలోపేతమే లక్ష్యం

- ప్రజలతో సన్నిహితంగా మమేకమవ్వాలి
- సమన్వయం, క్రమశిక్షణ, సేవా భావంతో పని చేస్తే కాంగ్రెస్ పార్టీకి మరింత ప్రజాదరణ
- డీసీసీ అధ్యక్షులకు మహేష్ కుమార్ గౌడ్ దిశానిర్దేశం

డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన నాయకులు జిల్లాల్లో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజలతో సన్నిహితంగా మమేకమవ్వాలని టీపీసీసీ చీఫ్‌మహేష్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.



# ఎన్నికల వరకే రాజకీయం

**ఏదులాపురం, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఎన్నికల వరకే రాజకీయం.. గెలిచిన తర్వాత ఏ పార్టీ వారైనా ప్రజా ప్రభుత్వం తరఫున పేదవాడికి సేవ చేయాల్సిందేనని తెలంగాణ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ కార్యాలయంలో పుర ఛైర్‌పర్సన్‌గా ఎంపికైన పోకబత్తిని అనిత బాధ్యతల స్వీకార కార్యక్రమానికి పొంగులేటి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు నమ్మి ఓటేశారని, కుర్చీలకే పరిమితం కాకుండా బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా ఏదులాపురాన్ని తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కొత్త పాలకవర్గం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలని వివరించారు. ఛైర్మన్, కౌన్సిలర్లు రోజూ ఉదయం వార్డుల్లో పర్యటిస్తూ పారిశుద్ధ్య, అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రతిదీ డబ్బుతోనే జరగదని, మన పనితీరు ఆధారంగా అనేక మంచి కార్యక్రమాలు అమలు చేయవచ్చని తెలిపారు. 15 రోజుల్లో మరో సమావేశం నిర్వహించి విడతల వారీగా ఎటువంటి ప్రగతి పనులు చేపట్టాలనే అంశంపై చర్చిస్తామని వివరించారు. ప్రజా జీవితంలో మనకు ఇచ్చిన అవకాశాన్ని పేదలకు మంచి చేసేందుకు వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం నూతన ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్, వార్డు కౌన్సిలర్లను సన్మానించారు. మద్దులపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ భైరు హరినాథ్‌బాబు, వైస్ ఛైర్మన్ తమ్మినేని నవీన్, కమిషనర్ మున్వర్ అలీ, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ..

## అగ్రనేత దేవ్‌జీ లొంగుబాటు!


- ఆయనతో పాటు లొంగిపోయిన మరో 20మంది మావోయిస్టులు

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. అగ్రనేతలు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, నర్సింహారెడ్డి అలియాస్ గంగన్నతోపాటు సుమారు 20 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు సమాచారం. ఆసిఫాబాద్ అడవుల్లో పోలీసుల ఎదుట వారు లొంగిపోయినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.దేవ్‌జీ ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా ఉన్నారు. నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టు పార్టీకి ఆయన నాయకత్వం వహిస్తున్నారు.

# కాంగ్రెస్ పార్టీకి ఏటీఎం లాగా మారిన తెలంగాణ రాష్ట్రం

(మొదటి పేజీ తరువాయి)

మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇండ్లను, లగచర్లలో గిరిజనుల భూమిని, హెచ్‌సీయూ విశ్వవిద్యాలయ భూమిని, హిల్ట్ పాలసీ పేరిట పరిశ్రమల భూమిని, అనుముల బ్రదర్స్ కలిసి ఆంబుక్క పడుతున్నారు. రెండేళ్లలోనే మూడు లక్షల కోట్ల అప్పు తెచ్చి రాష్ట్రంలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదీ సర్కారు. చేస్తున్నదల్లా దండుపాళ్యం ముఠాలాగా తెలంగాణను దోచుకోవడం, స్వంతానికి దాచుకోవడం. పదవిని కాపాడుకోవడం కోసం ఢిల్లీకి సంచులు మోయడం' అని కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.



# ఐసెట్ అభ్యర్థులకు టీశాట్ డిజిటల్ పాఠాలు..

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే ఎంబిఎ, ఎంసిఎ అర్హత పరీక్ష ఐసెట్ కోసం ఫిబ్రవరి 23వ తేదీ సోమవారం నుండి ప్రసారాలు మొదలవుతాయన్నారు. తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2026 మే 13,14వ తేదీన జరగనుండగా ఎనలిటిక్ ఎబిలిటీ, మ్యాథమెటిక్స్, కమ్యూనికేషన్ ఎబిలిటీ తదితర సబ్జెక్టులపై రోజుకు రెండు సబ్జెక్టుల చొప్పున ప్రసారం చేయనున్నామని, విద్యా ఛానల్ లో ఉదయం ఐదు నుండి ఆరు గంటల వరకు, నిపుణ ఛానల్ లో సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల వరకు డిజిటల్ లెసన్స్ ప్రసారమవుతాయి సీఈవో వివరించారు. తెలంగాణాలోని విద్యార్థులు టీశాట్ డిజిటల్ లెసన్స్ సద్వినియోగం చేసుకోవాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి సూచించారు.




# గోదావరి జలాల వివాదం రాజకీయరంగు పులుముకుంది

(మొదటి పేజీ తరువాయి)



మిగతా వాటిని పట్టించుకోలేదు. ఇప్పుడు మిగతా ప్రాజెక్టుల నిర్మాణానికి, భూ సేకరణకు తీవ్రంగా నిధుల కొరత ఉంది. మేడిగడ్డ కుంగిన తర్వాత అక్కడి నుంచి నీరు ఎత్తిపోయలేదు. కాళేశ్వరం నిరుపయోగమైనా.. అత్యధికంగా వరి దిగుబడి వస్తోంది. కేసీఆర్, హరీశ్‌రావు తప్పులు చేశారని ప్రజలు గ్రహించారు, తీర్పు ఇచ్చారు. పదేళ్లు వాళ్లేం చేశారో, ఈ ప్రభుత్వం ఏం చేసిందో సభలో చర్చిద్దాం. పదేళ్ల అనుభవంతో వాళ్లు సూచనలు చేస్తే.. స్వీకరిస్తాం. జలాల విషయంలో ఏపీకి సహకరిస్తున్నామనేది పూర్తి అసంబద్ధం. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దాం. ప్రజలు, నీళ్ల విషయంలో కాదు. పలు ఎన్నికల్లో ప్రజల తీర్పు చూశాక కూడా బీఆర్ఎస్ నేతలు మారలేదు. బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపించకపోవడం ప్రజల తప్పన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రజలను తప్పుపట్టడం మానేసి.. విజ్ఞతగా వ్యవహరించాలి. సీఎం కుర్చీ ప్రతీసారి వారసత్వంగా దక్కదు. తెదేపా, కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు వరుసగా రెండుసార్లు చొప్పున అవకాశం ఇచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ప్రజలు మరో అవకాశం ఇస్తారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులు గాలికి వదిలేయం. ప్రజల సొమ్ముతో కట్టిన ప్రాజెక్టులను వృథాగా వదిలేసేది లేదు. నిపుణుల సూచన ప్రకారం మరమ్మతులు చేసి.. వినియోగంలోకి తెస్తాం. విపక్షం అసెంబ్లీకి వచ్చి గోదావరి జలాలపై సూచనలు చేస్తే స్వీకరిస్తాం. ఏపీతో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునే దిశలో ఉన్నాం'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# 'మధు పార్క్' ను కూల్చకుండా చూసుకునే బాధ్యత నాది

**చేవెళ్ల, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** మధు పార్క్ రిడ్జ్ అపార్ట్మెంట్ను కూల్చకుండా చూసుకునే బాధ్యత తనది అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అపార్ట్మెంట్ వాసులకు భరోసా ఇచ్చారు. ఆదివారం సాయంత్రం ఆయన అపార్ట్మెంట్ వాసులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బండ్లగూడ జాగిర్ పరిధిలో ఉన్న మధు పార్క్ అపార్ట్ మెంట్ నివాసితులకు ఇటీవల గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. సుమారు 450 కుటుంబాలు నివసిస్తున్న ఈ అపార్ట్ మెంట్‌కు మహాత్మా గాంధీ సరోవర్ అభివృద్ధి పేరుతో 60 రోజుల్లో వివరణ ఇవ్వాలని అధికారులు సూచించారు. దీంతో గత పది రోజులుగా నివాసితులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి స్పందించారు. నోటిఫికేషన్ ఇన్స్పెక్ట్ చేయకుండా జారీ అయ్యి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, నోటీసులను ఉపసంహరించుకునేలా తాను వ్యక్తిగతంగా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఏ పార్టీ నాయకులైనా తనపై రాజకీయంగా ఆరోపణలు చేయవద్దని, సమస్య పరిష్కారమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి స్పందించకపోతే కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ను కలిసి సమస్య వివరించనున్నట్లు తెలిపారు. మధు పార్క్ అపార్ట్ మెంట్ కూల్చకుండా చూసుకునే బాధ్యత తనదేనని నివాసితులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి, గండిపేట్ మండల బీజేపీ అధ్యక్షుడు మహేష్ యాదవ్, రాష్ట్ర నాయకులు అంజన్ కుమార్, భీమార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ హత్యే..

(మొదటి పేజీ తరువాయి)

తొలగించుకునేందుకు కుట్ర పన్నాడని వివరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు చెందిన పోకల కోటేశ్వరరావు, షేక్ అబ్దుల్ హఫీజ్, అదే జిల్లాలోని చుంచుపల్లికి చెందిన ఎండీ అజ్మత్ అలీ ఖాన్‌లను సంప్రదించి వారి సహకారంతో శ్రీనివాస్‌ను కారులో విజయవాడ తీసుకెళ్తూ నార్కెట్‌పల్లి వద్ద హత్య చేయించాడన్నారు. నేరం బయట పడకుండా, దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు కారులో మృతదేహాన్ని ఉంచి, పాలేరు జలాశయంలో తోసేసినట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. అతి తక్కువ రోజుల్లోనే కేసును ఛేదించిన కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్సైలు నాగరాజు, దివ్యశ్రీ, జగదీశ్, సంతోష్‌లను ఏసీపీ అభినందించారు.

**ఏం జరిగిందంటే..**

ఈనెల 14న ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పాలేరు జలాశయంలోకి ఓ కారు దూసుకెళ్లిన ప్రమాదంలో అందులో ఉన్న బొగ్గుల శ్రీనివాస్ మృతిచెందాడు. ప్రమాద సమయంలో వాహనం నడుపుతున్న వ్యక్తి ఒకరు కారులో నుంచి కిందపడిపోయి అక్కడి నుంచి పరారైనట్లు మత్స్యకారులు గుర్తించారు. వారంతా వచ్చి కారును వెలికితీయగా వెనక సీట్లో శ్రీనివాస్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోలీసులు నేలకొండపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రి శవాగారంలో భద్రపరిచారు. శ్రీనివాస్ మృతిపై అనుమానాలున్నాయని అతడి సోదరుడు అబ్బులయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసుల హత్య కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.







# ఏఐ సమిట్ ప్రపంచ దేశాలను ఆకర్షించింది

**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** భారత ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిన ఏఐ సమిట్ ప్రపంచ దేశాలను ఆకర్షించిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఏఐ సమిట్‌లో ముఖ్యంగా రెండు భారత ఆవిష్కరణలు ప్రపంచ నేతలను ఆశ్చర్యపరిచాయని పేర్కొన్నారు. జంతువుల చికిత్సకు.. వాటిని ట్రాక్ చేయడానికి ఏఐను వినియోగించడం, భారత పురాతన గ్రంథాలు, జ్ఞానాన్ని సంరక్షించడానికి ఏఐను ఉపయోగించడం చూసి ప్రపంచ నేతలు ప్రశంసించారని ప్రధాని అన్నారు. ఆదివారం 131వ 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. కృత్రిమ మేధస్సు, అంతరిక్ష పరిశోధన, సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ సహా అభివృద్ధి చెందుతోన్న సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగిస్తూ భారత్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని అన్నారు. మన యువత తమ ఆవిష్కరణలతో దేశ కీర్తిని ఉన్నత శిఖరాలను తీసుకువెళ్లే శక్తిని కలిగి ఉందని ప్రశంసించారు. ఈ సదస్సు ద్వారా వివిధ దేశాల నేతలకు, టెక్ దిగ్గజాలకు మన యువత ప్రతిభను, నూతన ఆవిష్కరణలను స్వయంగా చూపించే అవకాశం లభించిందన్నారు. ప్రపంచ స్థాయి నాణ్యతను దృష్టిలో పెట్టుకొని వస్తువుల ఉత్పత్తి, సేవలు ఉండాలని దేశంలోని తయారీదారులు, స్టార్టప్‌లకు సూచించారు. అలాగే సైబర్ నేరాలపై ప్రధాని మోడీ హెచ్చరించారు. డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

**ఆ చిన్నారి నలుగురికి జీవనదాత..**

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కేరళకు చెందిన 10 నెలల చిన్నారి అలిన్ షెరిన్ ను ప్రధాని గుర్తు చేసుకున్నారు. బ్రెయిన్ డెడ్ అయిన తమ చిన్నారి అవయవాలను దానం చేయడానికి ముందుకు వచ్చిన ఆమె తల్లిదండ్రులను ప్రశంసించారు. బిడ్డను కోల్పోయిన బాధలోనూ వారు తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. దీనివల్ల ఆ చిన్నారి నలుగురికి జీవనదాతగా మారిందన్నారు. ఇటువంటి ఘటనల వల్ల దేశంలో అవయవ దానంపై అవగాహన పెరుగుతోందన్నారు.

# జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..



**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** జమ్మూకశ్మీర్‌లోని కిష్త్‌వాడ్‌లో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదులు హతమయ్యారు. వారికి జైషే మహమ్మద్‌తో సంబంధం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ముగ్గురి మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయని చెప్పారు. భద్రతా ఏజెన్సీల ప్రాథమిక అంచనాల ప్రకారం మృతుల్లో ఒకరిని జైషే మహమ్మద్ కమాండర్ సైఫుల్లాగా భావిస్తున్నట్లు తెలిపారు.ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే నిఘావర్గాల సమాచారం ఆధారంగా భద్రతాబలగాలు కిష్త్‌వాడ్‌లో ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ క్రమంలోనే చత్రూ బెల్ట్‌లోని పాసెర్‌కుట్ ప్రాంతంలోని ఓ గుడిసెలో ఉగ్రవాదుల ఆచూకీని గుర్తించాయి. దీంతో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ముగ్గురు ఉగ్రవాదులను భద్రతాబలగాలు మట్టుబెట్టాయి. గుడిసెలో మంటలు చెలరేగడంతో మృతదేహాలు కాలిపోయాయి. ఘటనాస్థలం నుంచి రెండు ఏకే47 రైఫిల్స్, ఇతర పేలుడు పదార్థాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. కరడుగట్టిన ఉగ్రవాది సైఫుల్లా దాదాపు ఐదేళ్ల క్రితం జమ్మూకశ్మీర్‌లోకి చొరబడినట్లు సమాచారం. అప్పటినుంచి స్థానికంగా యాక్టివ్‌గా ఉన్నాడు. 2024 జులైలో నలుగురు సైనికుల మృతికి కారణమైన దాడి సహా అనేక ఘటనలకు సూత్రధారి అనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో అనేక ఎన్‌కౌంటర్‌ల నుంచి తప్పించుకున్నాడు. తాజా ఎన్‌కౌంటర్‌తో కలిపి ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఏడుగురు జైషే మహమ్మద్ ఉగ్రవాదులు హతమయ్యారు.

# పార్టీ బలోపేతమే లక్ష్యం

**తెలంగాణ బ్యూరో , స్నేహిత ఎక్స్‌ప్రెస్:** డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన నాయకులు జిల్లాల్లో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజలతో సన్నిహితంగా మమేకమవ్వాలని టీపీసీసీ చీఫ్‌ మహేష్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. సమన్వయం, క్రమశిక్షణ, సేవా భావంతో పని చేస్తే కాంగ్రెస్ పార్టీకి మరింత ప్రజాదరణ లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. వికారాబాద్ అనంతగిరిలో ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరం రెండో రోజు కార్యక్రమంలో మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం పాల్గొన్నారు. సంఘటన సృజన్ అభియాన్ కార్యక్రమం భాగంగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక శిక్షణా శిబిరం ద్వారా పార్టీ సంస్థాగత బలోపేతానికి, నాయకత్వ సామర్థ్యాల అభివృద్ధికి దిశానిర్దేశం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రాల వారీగా డీసీసీ అధ్యక్షులకు సమగ్ర అవగాహన కల్పిస్తూ, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై స్పందన విధానాలు, పార్టీ విధానాల అమలు, బూత్ స్థాయి బలోపేతం వంటి అంశాలపై విస్తృత చర్చలు నిర్వహిస్తున్నారు. పది రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో నాయకత్వ నైపుణ్యాలు, ప్రజా సమస్యల పరిష్కార విధానాలు, ఎన్నికల వ్యూహ రచన, సోషల్ మీడియా మరియు మీడియా నిర్వహణ, కార్యాచరణ ప్రణాళికలు వంటి కీలక అంశాలపై నిపుణుల ద్వారా డీసీసీ చీఫ్‌లకు శిక్షణ అందించనున్నారు.





# నిరుపేదల ఆపద్బాంధవుడు చిట్టెపు ప్రకాష్ రెడ్డి

- చిట్టెపు ప్రకాష్ రెడ్డి స్మారకార్థం నిర్వహించిన తాజా,మాజీ ప్రజా ప్రతినిధుల సన్మాన సభలో
- తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్తు మాజీ చైర్మన్ పర్యాద కృష్ణమూర్తి
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పి.నారాయణ రెడ్డి
- పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై. నర్సింహులు
- చిట్టెపు రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తాజా,మాజీ ప్రజా ప్రతినిధులకు ఘన సన్మానం



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నిరుపేదలకు నిస్వార్ధంగా సేవ చేసిన గొప్ప మనసున్న నాయకుడు స్వర్గీయ చిట్టెపు ప్రకాష్ రెడ్డి అని తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్తు మాజీ చైర్మన్ పర్యాద కృష్ణమూర్తి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పి.నారాయణ రెడ్డి,పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై, నర్సింహులు అన్నారు.ఆదివారం పెద్దేముల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో పెద్దేముల్ మండల యువనాయకుడు చిట్టెపు రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన తండ్రి చిట్టెపు ప్రకాశ్ రెడ్డి జ్ఞాపకార్థం పెద్దేముల్ మండలానికి చెందిన తాజా, మాజీ ప్రజా ప్రతినిధులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. చిట్టెపు ప్రకాష్ రెడ్డి నిరుపేదలకు సహాయం చేసే ప్రజా నాయకుడని అన్నారు.ప్రకాష్ రెడ్డి ధైర్యశాలి అని,మొండి పట్టుతో అనుకున్న పనిని సాధించిన వ్యక్తి అని అన్నారు.సుమారు 40 సంవత్సరాల పాటు పెద్దేముల్ మండలంలో రాజకీయంగా ఎంతో మంది నిరుపేదలకు నిస్వార్థంగా సేవలను అందించి,ఎంతో మంది నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు.అందరితో ఆప్యాయంగా మాట్లాడుతూ..నిరుపేద ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరించి,ప్రజల మన్ననలను పొందిన ప్రజా నాయకుడని అన్నారు.తప్పును తప్పు ఒప్పును ఒప్పు అంటూ ముక్కు సూటిగా మాట్లాడే ఏకైక వ్యక్తి ప్రకాష్ రెడ్డి అని అన్నారు. పెద్దేముల్ మండలంలో ఎక్కడ నిరుపేదలకు అన్యాయం జరిగితే అక్కడికి ప్రకాష్ రెడ్డి చేరుకొని ప్రజల న్యాయం చేసేవాడని అన్నారు. మండలంలో ఏ కార్యకర్తకు ఏ సమయంలో ఆపద వచ్చిన ముందుండి ఆదుకునే నాయకుడు ప్రకాష్ రెడ్డి అని అన్నారు.తన తండ్రి జ్ఞాపకార్థం చిట్టెపు రాఘవేందర్ రెడ్డి పెద్దేముల్ మండల తాజా, మాజీ ప్రజా ప్రతినిధులను సన్మానించడం హర్షణీయమని అన్నారు. పెద్దేముల్ మండల యువ నాయకుడు చిట్టెపు రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ పెద్దముల్ మండలానికి చెందిన తాజా,మాజీ ప్రజాప్రతినిధుల సేవలను గుర్తించడానికి, రాజకీయ పార్టీలకు అతీతంగా యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి, రాజకీయాల పట్ల యువతకు అవగాహన కల్పించడానికి తాజా,మాజీ ప్రజా ప్రతినిధులను సన్మానించుకోవడం జరిగిందని అన్నారు.అంతకుముందు కార్యక్రమంలో పలువురు తాజా, మాజీ నాయకులు స్వర్గీయ చిట్టెపు ప్రకాష్ రెడ్డితో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని ఆయనతో ఆనాడు గడిపిన క్షణాలను, జ్ఞాపకాలను,జరిగిన సంఘటనలను నెమరు వేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు.ఈ కార్యక్రమంలో పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై.నర్సింహులు, మాజీ డిసిసిబి ఛైర్మెన్ పి.లక్ష్మారెడ్డి,కోట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య,ప్రముఖ వక్త కోకట్ నారాయణ రెడ్డి,పెద్దేముల్ సొసైటీ మాజీ చైర్మన్ ద్యావరి విష్ణు వర్ధన్ రెడ్డి,నరేష్ రెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి,బంగ్ల రవి కుమార్ రెడ్డి,ద్యావరి నరేందర్ రెడ్డి,ద్యావరి కృష్ణారెడ్డి రెడ్డి, కార్యక్రమ వాఖ్యాత పోల నవీన్ కుమార్,చిట్టెపు ప్రకాష్ రెడ్డి యువసేన సభ్యులు, పెద్దేముల్, కోట్ పల్లి మండలాల 6 గ్రామాల తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు,వివిధ పార్టీల నాయకులు,యువకులు,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## చిట్టెపు రాఘవేందర్ రెడ్డి ఆలోచనకు హ్యాట్సాఫ్

**పెద్దేముల్,స్నేహిత,ఎక్స్ ప్రెస్:** పెద్దేముల్ మండల తాజా, మాజీ ప్రజా ప్రతినిధులను వారి సేవలను గుర్తించి చిట్టెపు ప్రకాష్ రెడ్డి స్మారకార్థం చిట్టెపు రాఘవేందర్ రెడ్డి ఘనంగా సన్మానించడం అభినందనీయమని పెద్దేముల్ మండల క్రాంతి యువజన సంఘం సభ్యులు అన్నారు.ఈ మేరకు ఆదివారం చిట్టెపు రాఘవేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ..రాజకీయ రంగంలో ఆయా గ్రామాల్లో వివిధ పదవుల్లో ఎన్నికై ప్రజలకు విశేష సేవలు అందించి ప్రజల మన్ననలను పొందిన పెద్దేముల్ మండల తాజా, మాజీ ప్రజా ప్రతినిధులను సన్మానించడం అభినందనీయమని అన్నారు.తాజా, మాజీ ప్రజాప్రతినిధులను సన్మానించడంతో సమాజంలో వారి సేవలను గుర్తించి,రాజకీయాల పట్ల యువతకు ప్రోత్సాహాన్ని అందించినట్లు అవుతుందని అన్నారు. యువకులు రాజకీయ రంగంలో ముందుండి ప్రజలకు సామాజికంగా నిస్వార్థ సేవలను అందించేలా కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై.నర్సింహులు,వార్డు సభ్యులు ఎర్ర వెంకట్,డాక్టర్ శంకర్,క్రాంతి యువజన సంఘ సభ్యులు ఎర్ర రవీందర్,మామిళ్ళ వెంకట్,టి.గోపాల్,సంమృద్ధి,పి.గోపాల్,తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మారెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం

**ప్రతి పేదవాడికి ఇల్లు ఇవ్వడమే కాంగ్రెస్ లక్ష్యం : మేడిపల్లి వెంకటయ్య**



**నవాబ్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నవాబుపేట్ మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లుకు ఘనంగా గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నవాబుపేట్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సామా వెంకట్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేడిపల్లి వెంకటయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని, ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్ అంటేనే ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు,ఉచిత కరెంటు,ఉచిత బస్సు వంటి పథకాలు గుర్తుకు వస్తాయని పేర్కొన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు గృహాలు అందలేదని, కంటికి కనిపించని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మాత్రమే చూపించారని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని అన్నారు.మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సామా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ నవాబుపేట్ మండలంలోని ప్రతి గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో 18 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా,అందులో ఐదు ఇండ్లు పూర్తయ్యాయని, మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. గ్రామంలోని ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు.గ్రామ సర్పంచ్ అనంతగిరి పల్లి ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగలి ప్రవళిక రాజు కుటుంబానికి గృహప్రవేశం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు,మాజీ సర్పంచ్ వంటిమినపల్లి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ కరణం రఘు, పుల్మామిడి గ్రామ సర్పంచ్ దాన నర్సింలు,యావపూర్ సర్పంచ్ ఎం.లక్ష్మణ్,తిమ్మారెడ్డిపల్లి ఉప సర్పంచ్ టి.మల్లేష్,జనార్దన్ రెడ్డి, కళ్యాణ్ రావు, గ్రామస్తులు,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బచ్చోడులో మంచినీటి బోరు, చేతి పంపుల మరమ్మతులు

- ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా
- సర్పంచ్ నందిపాటి మల్లిఖార్జున్

**పాలేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పంచాయితీ పాలకవర్గం సమన్వయంతో ముందుకెళ్తామని సర్పంచ్ తిరుమలాయపాలెం మండలంలోని బచ్చోడు సర్పంచ్ నందిపాటి మల్లిఖార్జున్ తెలిపారు.రాబోయే వేసవికాలం దృష్ట్యా గ్రామంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా పంచాయితీ కార్యదర్శి నిఖిల్ ముందు చూపుతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆదివారం చేతి పంపులకు,మంచినీటి బోరులకు మరమ్మతులు చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామాభివృద్ధి,మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాజీ పడే ప్రసక్తే లేదని అన్నారు.ఇప్పటికే గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టామని చెప్పారు.తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సహకారంతో,గ్రామ పెద్దలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రామసహాయం అరవింద్ రెడ్డి ప్రోత్సాహంతో బచ్చోడు గ్రామాన్ని మండలంలోనే అభివృద్ధిలో అగ్రగామిగా,ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన బ్రహ్మోత్సవాలు

**ప్రత్యేక పూజలు చేసిన జిల్లా నాయకులు**



**రాయికల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రాయికల్ మండలంలోని భూపతిపూర్ గ్రామంలో ఆదివారం నక్కలగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామ ప్రజల సౌజన్యంతో స్వామివారి కళ్యాణం, మహా అన్నదానం ,రథోత్సవం కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో సేవలు,పూజలు చేశారు.యాచమనేని గంగారావు- రాధమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు అన్నదాన వితరణ చేపట్టగా, బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన రోజు నుండి యువమిత్ర యూత్ సభ్యులు భక్తులకు త్రాగునీరు అందించారు.ఈ సందర్భంగా సేవలందించిన వారందరికీ గ్రామ పాలకవర్గం తరపున, గ్రామ ప్రజల తరపున సర్పంచ్ గుర్రం మహేందర్-భావన, ఉప సర్పంచ్ మూగల సంజీవచారి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబెర్స్ పృధ్విరాజ్,రాము ఎమ్మెల్సీ రమణ, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, మాజీ జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత, జగిత్యాల్ బీజేపీ ఇంచార్జి బోగ శ్రావణి ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు. కళ్యాణ అనంతరం వీరికి నిర్వాహకులు మెమంటో సాలువతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు,గ్రామ ప్రజలు,పరిసర ప్రాంత గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి కుమారుడు అనురాగ్ రెడ్డి వివాహం మౌనికతో హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,రాష్ట్ర మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్‌కుమార్ షేట్కర్, మాజీ మంత్రి హరీష్‌రావు తదితరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుక సందడిగా,ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది.



## అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులకు కఠిన శిక్షలు తప్పవు

- దుండగులకు ఎస్ఐ అరవింద్ హెచ్చరిక



**మోమిన్‌పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మోమిన్‌పేట్ మండల పరిధిలోని అమ్రాది కలాన్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది.ఈ ఘటనతో గ్రామంలో ఉద్విగ్న వాతావరణం నెలకొంది.సమాచారం అందుకున్న వెంటనే మోమిన్‌పేట్ పోలీస్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ ప్రారంభించినట్లు ఎస్ఐ అరవింద్ తెలిపారు.రెండు రోజుల్లో విచారణ పూర్తి చేసి నిందితులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.ఈ ఘటనపై అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి మార్గదర్శకుడైన మహానేత విగ్రహంపై దాడి చేయడం దారుణమని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు సంయమనం పాటించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.శాంతి భద్రతలను భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఆర్థిక లావాదేవిలతోనే యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ హత్య



- బొగ్గుల శ్రీనివాస్ ది సుపారీ హత్యే.. కేసును ఛేదించిన పోలీసులు
- జనసంచారం లేని ప్రదేశంలో కత్తులు, ఐరన్ రాడ్లతో తలపై దాడి



**పాలేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కూసుమంచి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న యూట్యూబర్ హత్య కేసును పోలీసులు ఛేదించి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు.ఈ మేరకు Cr.No. 45/2026 U/s 103, 61, 238 r/w 3(5) బి.ఎన్.ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.అల్లూరు గ్రామానికి చెందిన గొల్ల శ్రీనివాసులు అలియాస్ బొగ్గుల శ్రీనివాస్ (48), ప్రస్తుతం హైదరాబాద్‌లో నివసిస్తూ యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వీడియోలు చేస్తుండేవాడు.ఆయన "బొగ్గుల బీబీక్ " పేరిట జీఎస్టీలైసెన్స్ కలిగి ఉన్నారు. సిల్వర్ జూబ్లీ కాలేజీలో కలిసి చదివిన పరిచయంతో మేకల వేణు మాధవ్ రెడ్డి (ఏ 1)తో మళ్లీ సంబంధాలు కొనసాగించారు.ఏ 1 "మేకా ప్రాజెక్ట్స్" పేరిట సంస్థ నిర్వహిస్తూ, జిఎస్టి లైసెన్స్ ఆధారంగా ఫేక్ ఇన్వాయిసులు, సేల్స్ ఫైలింగ్స్ ద్వారా లాభాలు పొందవచ్చని సూచించాడు.లాభాల్లో 50% వాటా ఇవ్వాలని ఒప్పందం కుదిరింది.2022 నుంచి 2025 వరకు సుమారు రూ. 90 లక్షలు సంపాదించినట్లు దర్యాప్తులో తేలింది. అందులో శ్రీనివాస్ వాటా రూ.45 లక్షలు కాగా,రూ.15 లక్షలు మాత్రమే చెల్లించి మిగతా రూ.30 లక్షలు తరువాత ఇస్తానని ఏ 1 తెలిపినట్లు సమాచారం.ఈ వ్యవహారంపై జీఎస్టీ శాఖ నుంచి నోటీసులు రావడంతో "బొగ్గుల బీబీక్ " లైసెన్స్ రద్దయింది. లైసెన్స్ పునరుద్ధరణకు దాదాపు రూ.1 కోటి జరిమానా అవసరమని తెలిసింది. దీంతో డబ్బుల వివాదం తీవ్రరూపం దాల్చి ఇద్దరి మధ్య విభేదాలు పెరిగాయి.దర్యాప్తులో తేలిన ప్రకారం, ఆర్థిక ఒత్తిడి మరియు వివాదాల నేపథ్యంలో ఏ 1 మేకల వేణు మాధవ్ రెడ్డి, ఏ 2 పోకల కోటేశ్వరరావు, ఏ 3 షేక్ అబ్దుల్ హఫీజ్, ఏ 4 ఎండి.అజ్మత్ అలీ, ఖాన్ కలిసి హత్యకు కుట్ర పన్నారు. ఏ 3, ఏ 4లు రూ.5 లక్షల సుపారీ ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.ఫిబ్రవరి 13 రాత్రి పెండింగ్ డబ్బులు చెల్లిస్తామని నమ్మబలికి విజయవాడకు వెళ్దామని చెప్పి కారులో తీసుకెళ్లారు. ఫిబ్రవరి 14 తెల్లవారుజామున నకిరేకల్-జనగాం మార్గంలో జనసంచారం లేని ప్రదేశంలో కత్తులు, ఐరన్ రాడ్లతో తలపై దాడి చేసి హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.అనంతరం ఘటనను రోడ్డు ప్రమాదంగా చూపించేందుకు మృతదేహంతో పాటు వాహనాన్ని పాలేరు రిజర్వాయర్‌లో పడవేసినట్లు సమాచారం.సాంకేతిక ఆధారాలు, ఇతర సాక్ష్యాల ఆధారంగా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. హత్యలో ఉపయోగించిన ఆయుధాలు స్వాధీనం చేసుకునే ప్రక్రియ కొనసాగుతోంది. కేసు నమోదైన వెంటనే ఖమ్మం రూరల్ ఏసీపీ పర్యవేక్షణలో కూసుమంచి సీఐ టి.సంజీవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి, కూసుమంచి, నేలకొండపల్లి,తిరుమలాయపాలెం పోలీసుల సమన్వయంతో వేగవంతంగా దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.




# అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని కాపాడిన 108 వైద్య సిబ్బంది

**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అపస్మారక స్థితిలో ఉన్న ఒక వ్యక్తికి సకాలంలో 108 సిబ్బంది వైద్యం అందించి ప్రాణాలను కాపాడిన సంఘటన ఆదివారం పెద్దేముల్ మండల పరిధిలోని సిద్ధన్నమదుగు తాండ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది.ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.పెద్దేముల్ మండల పరిధిలోని సిద్ధన్న మదుగు తండాకు చెందిన లాలు నాయక్(52) శనివారం సాయంత్రం మద్యం సేవించి ఆదివారం ఉదయం 10 గంటల వరకు నిద్రలో నుండి లేవలేదు. దీంతో ఒక్కసారిగా భయానికి గురైన కుటుంబ సభ్యులు చేసేదేమీ లేక లాలు నాయక్ కుటుంబ సభ్యులు 108కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఫోన్ ద్వారా సమాచారం అందుకున్న 108 సిబ్బంది హుటా హుటిన సిద్దన్న మదుగు తండా గ్రామానికి చేరుకొని లాలు నాయక్ కు అత్యవసర వైద్య పరీక్షలు నిర్వహించి అతడి జీబీఆర్ఎస్ చెక్ చేయగా చాలా తక్కువగా నమోదైంది. దీంతో వెంటనే అప్రమత్తమైన 108 సిబ్బంది ఆయనకు ఐవీ డీ25 కనెక్ట్ చేయగా డీ25 కనెక్ట్ చేసిన కొద్ది సేపటిలోనే లాలు నాయక్ అపస్మారక స్థితి నుండి కొలుకొని పైకి లేచి నడిచాడు.అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆయనను తాండూరు జిల్లా ఆసుపత్రికి 108 అంబులెన్స్ వాహనంలో తరలించారు.108 సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లో సిద్దన్న మదుగు తండా గ్రామానికి చేరుకొని సకాలంలో లాలు నాయక్ కు వైద్య పరీక్షలు నిర్వహించడంతోనే లాలు నాయక్, కొలుకొన్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు.అందుకు లాలు నాయక్ కుటుంబ సభ్యులు 108 సిబ్బంది పనితీరు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దేముల్ మండల 108 వైద్య సిబ్బంది ఈఎంటీ నర్సింహులు, పైలట్ నర్సింహులు,లాలు నాయక్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అటల్ జీకు అక్షర నీరాజనం కార్యక్రమం విజయవంతం చెయ్యండి

- బీజేపీ జిల్లా నాయకులు అటల్ బిహారీ వాజ్ పాయ్ శత జయంతి
- ఉత్సవ కమిటీ సభ్యులు గుండా ఉపేందర్ రెడ్డి





**పాలేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మార్చి 1 వ తేదీన ఖమ్మంలో ఎస్ఆర్ గార్డెన్ యందు భారత మాజీ ప్రధాని,భారత రత్న అటల్ బిహారీ వాజ్ పాయ్,శత జయంతి ఉత్సవాల్లో భాగంగా అటల్ జీ కు అక్షర నీరాజనం కార్యక్రమం ఉత్సవ కమిటీ అధ్యక్షులు దుద్దుకూరీ కోటేశ్వర రావు,ప్రధాన కార్యదర్శి శ్రీ మండడపు ప్రభాకర్ రెడ్డి,కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమం నకు ముఖ్య అతిథిగా మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు వస్తున్నారు.అదేవిధంగా వారితోపాటు విశిష్ట అతిథిలుగా రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు,వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, హాజరవుతున్నారు. అదేవిధంగా అతిథులుగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ్ రెడ్డి,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవి చంద్ర,జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్,మాజీ రాజ్య సభ సభ్యులు శ్రీ గరికపాటి రామ్మోహన రావు,బీజేపీ జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి,రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవ రావు,పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, వారితోపాటు అతిథిలుగా ప్రముఖ కవి, రచయిత, ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ ఆచార్యులు శ్రీ కసిరెడ్డి వెంకట్ రెడ్డి,ఆంధ్ర భారత సామాజిక సాంస్కృతిక కళావిభాగం కన్వీనర్ అప్పల ప్రసాద్,తదితరులు హాజరు అవుతున్నారు. ఖమ్మం ఎస్.ఆర్ గార్డెన్ లో జరిగే అటల్ బిహారి వాజ్ పాయ్ శతజయంతి ఉత్సవాలలో 'అటల్ జీవి అక్షర నిర్మాణం కవితా సంకలనం 'పుస్తక ఆవిష్కరణ ఉంటుంది.అటల్ బిహారీ వాజ్ పాయ్, భారతీయ జనతా పార్టీ (బీజేపీ ) వ్యవస్థాపక నాయకుడు మరియు భారతరత్న గ్రహీత. మూడుసార్లు (1996,19981999, 19992004) భారత ప్రధానిగా పనిచేసిన ఆయన, స్థిరమైన సంకీర్ణ ప్రభుత్వాలను నడిపి, అణు పరీక్షలు (పోఖ్రాన్II), సవర్ణ చతుర్భుజి ప్రాజెక్టులతో దేశాభివృద్ధికి, ఆధునీకరణకు కీలక కృషి చేశారు.భారతదేశాన్ని ప్రగతిబాటలో నడిపిన మహా నాయకుడు వాజ్ పాయ్ అని,వారు చూపిన మార్గాన్ని భావితరాలకు చేరే విధంగా శతజయంతి వేడుకలను ఖమ్మంలో ఘనంగా నిర్వహిస్తున్నాము.ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరుతున్నాము.








# ఏదులాపురం మున్సిపాలిటీనీ ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపట్టాలి
- ఏదులాపురం మున్సిపల్ పాలకవర్గం సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి

**పాలేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పాలేరు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన పాలకవర్గం, మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ..ఏదులాపురం మున్సిపాలిటీ కి నూతనంగా చైర్ పర్సన్ గా ఎంపికైన అనిత, వైస్ చైర్మన్ నవీన్, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ లకు అభినందనలు తెలిపారు. ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసిందని, ఎన్నికల వరకే రాజకీయాలు ఉంటాయని, ఎన్నికల తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలు,అభివృద్ధి కార్యక్రమాలపై మాత్రమే దృష్టి సారించాలని అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ చాలా విశాలంగా ఉంటుందని,ఇక్కడ ఓపెన్ ప్లేస్ చాలా ఉన్నదని,అనేక మౌలిక వసతుల కల్పన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రంలో ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా ఏదులాపురంను అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు.ప్రతి కౌన్సిలర్ రోజు ఉదయం వార్డు పరిధిలో పర్యటిస్తూ జరిగే పారిశుద్ధ్య పనులను,అభివృద్ధి పనులు పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. ప్రతి పని డబ్బుతోనే జరగదని మన పని తీరు ఆధారంగా అనేక మంచి కార్యక్రమాలు అమలు చేయవచ్చని తెలిపారు. వారానికి కనీసం ఐదు రోజులు రెండు గంటల పాటు వార్డులో సమయం గడపాలని అన్నారు. 15 రోజులలో మరొక సమావేశం నిర్వహించి విడతల వారీగా ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టాలి అనే అంశంపై సమావేశం నిర్వహిస్తామని అన్నారు. మున్సిపాలిటీలో క్షేత్రస్థాయి పర్యటనలు ఓపెన్ ప్లాట్లలో నీరు నిలవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడడం గమనించామని, నాలాల ఆక్రమణల తొలగింపు చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రజా జీవితంలో మనకు వచ్చిన అవకాశాన్ని పేదలకు మంచి చేసేందుకు వినియోగించాలని మంత్రి సూచించారు.ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ బాబు,ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్,ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ మునవర్ అలీ,మునిసిపల్ కౌన్సిలర్లు,వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పేటలో గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ అరెస్ట్

- బాన్సువాడ నిరసనకు వెళ్తుండగా పోలీసులు ముందస్తు అరెస్ట్
- పోలీస్ స్టేషన్ ఎదుట బిజెపి, హిందూ సంఘాల బైఠాయించారు
- అంబేద్కర్ చౌరస్తా వద్ద రహదారి నిరసన



**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** బాన్సువాడలో జరుగుతున్న నిరసన కార్యక్రమానికి మద్దతుగా వెళ్తున్న గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజా సింగ్‌ను మెదక్ జిల్లా పోలీసులు ఆదివారం పెద్ద శంకరం పేటలో అదుపులోకి తీసుకున్నారు.ఈ ఘటనతో పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హైదరాబాద్ నుంచి బయలుదేరిన ఎమ్మెల్యేను పట్టణ సమీపంలోని కింగ్స్ తొమ్మిది భోజనశాల వద్ద పోలీసులు ఆపి అరెస్ట్ చేశారు. డిఎస్పి ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ఈ చర్య చేపట్టినట్లు తెలిసింది. అనంతరం ఆయనను పెద్ద శంకరంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అరెస్ట్ విషయం తెలిసిన వెంటనే మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో హిందూ సంఘాల నాయకులు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి రాజా సింగ్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తదుపరి అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై నిరసన చేపట్టారు. ఈ సమయంలో ఆగి ఉన్న బస్సు అద్దంపై కొట్టడంతో స్వల్ప పగుళ్లు ఏర్పడ్డాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఎమ్మెల్యేను పోలీస్ స్టేషన్ నుంచి హైదరాబాద్‌కు తరలించారు.తరలింపు సమయంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద టి.రాజా సింగ్ మాట్లాడుతూ..తాను నిర్మల్ జిల్లాలో శివాజీ విగ్రహావిష్కరణకు వెళ్తుండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం సిఐ రేణుక రెడ్డి,పెద్ద శంకరంపేట, అల్లాదుర్గం, రేగోడు ఎస్ఐలు ప్రవీణ్ రెడ్డి, శంకర్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు. పోలీసులు శాంతి భద్రతల కోసం అప్రమత్తంగా వ్యవహరించారు.



## డ్రెస్సింగ్ వివాదం మళ్లీ రగిలింది..

హీరోయిన్ల డ్రెస్సింగ్‌పై సీనియర్ నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు మరోసారి సోషల్ మీడియాలో చర్చకు దారి తీశాయి. ఆ వ్యాఖ్యలకు పరోక్షంగా స్పందించినట్లు కనిపించిన నిధి అగర్వాల్ తాజా పబ్లిక్ అప్పియరెన్స్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. శివాజీ వ్యాఖ్యల అనంతరం నిధి అగర్వాల్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో చేసిన పోస్ట్ చర్చనీయాంశమైంది. బాధితురాలినే నిందించడం సానుభూతి కాదని, అలాంటి వ్యాఖ్యలు తప్పుదోవ పట్టిస్తాయని ఆమె పేర్కొన్నారు. ఎవరినీ నేరుగా ఉద్దేశించకపోయినా, ఆ పోస్ట్ శివాజీ కామెంట్స్‌కు కౌంటర్‌గా భావిస్తూ నెటిజన్లు చర్చించుకున్నారు. ఇదిలా ఉండగా నిధి రీసెంట్‌గా ఫిలిం ఫేర్ అవార్డ్స్ ఈవెంట్‌కు స్టైలిష్ మోడ్రన్ డ్రెస్‌లో హాజరైన వీడియో వైరల్ అవుతోంది. దీంతో "డ్రెస్సింగ్‌తోనే సమాధానం ఇచ్చింది" అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. మహిళలు ఏ దుస్తులు ధరించాలో అది వారి వ్యక్తిగత ఎంపికేనని, దానిని తప్పు బట్టడం సరికాదని పలువురు మద్దతు తెలుపుతున్నారు. శివాజీ మాత్రం తన ఉద్దేశం ఎవరినీ విమర్శించడం కాదని మరోసారి స్పష్టం చేశారు.

## భక్తమార్కండేయ ఆలయం వార్షికోత్సవానికి సర్వం సిద్ధం

- వైభవంగా శివపార్వతుల కళ్యాణం
- ఉత్సవ మూర్తుల శోభాయాత్రలో భజన,కోలాటం





**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పట్టణంలోని వెంకటాపూర్ చౌరస్తాలో తూర్పుకు అభిముఖంగా వెలిసిన శ్రీ భక్తమార్కండేయ ఆలయం ప్రథమ వార్షికోత్సవానికి సర్వం సిద్ధమైంది.ఫిబ్రవరి 23 సోమవారం రోజున ఆలయ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చంద్రమౌళీశ్వర బ్రహ్మసూత్ర లింగాన్ని దర్శించుకుని దైవానుగ్రహం పొందాలని వారు కోరారు. వేద పండితులు బ్రహ్మశ్రీ గురురాజు శర్మ వారి శిష్య బృందం ఆధ్వర్యంలో గణపతి హోమం, ప్రత్యేక అభిషేకం, శివపార్వతుల కళ్యాణం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు దత్తాత్రేయ ఆలయం నుండి శ్రీ భక్తమార్కండేయ ఆలయం వరకు ఉత్సవ విగ్రహాల శోభాయాత్ర జరగనుంది.ఈ శోభాయాత్రలో మహిళల కోలాటం, భజన, సీతమ్మ జడ కొప్పు వంటి సాంప్రదాయ కార్యక్రమాలు ఆకట్టుకోనున్నాయి.అలాగే రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ, వైరాగ్య శిఖామణి అవధూత మహారాజ్, సంగ్రామ్ మహారాజ్, కరణ్ గజేంద్ర భారతి మహారాజుల దివ్య ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.భక్తుల కోసం మహా అన్నప్రసాద విందును ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ దైవ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బోలా శంకరుడి కృపాకటాక్షాలు పొందాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## ముఖ్యమంత్రిని కలిసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు టీ.వెంకట్ రాజ్



**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా వికారాబాద్ మున్సిపల్ కేంద్రంలోని అనంతగిరి హరిత రిసార్ట్స్ లో జరుగుతున్న ఏపీ,తెలంగాణ డిసిసి అధ్యక్షుల శిక్షణ శిబిరం కార్యక్రమంలో పాల్గొనడానికి వికారాబాద్ విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని శ్రీ అనంత పద్మనాభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలోని హేలిప్యాడ్ వద్ద జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులైన మున్సిపల్ చైర్ పర్సన్ అనన్య, వైస్ చైర్ పర్సన్ అర్థ సుధాకర్ రెడ్డి,వికారాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ప్రజా ప్రతినిధులు స్థానిక కాంగ్రెస్ కౌన్సిలర్ శ్రీకాంత్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు అభిలాష్ రెడ్డితో కలిసి కరచలనం అందించి,స్వాగతం పలికిన వికారాబాద్ మున్సిపల్ 21 వార్డ్ ఎమ్ఐ జి కాలనికి చెందిన టీ.వెంకట్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com